మూలిగే నక్కలు

శ్రీమతి సహదేవ తారాదేవి

శరభయ్య - కాంతమ్మ
పోతరాజు - ప్రభావతి

(శరభయ్య ఇలు. కాంతమ్మ హాలులో వెనక్కి తిరిగి ఖాళీప్లేట్లు తీస్తుంటుంది. ప్రవేశం శరభయ్య ముందునుంచి)

శ: (ఉస్సురంటూ గుమ్మంలోంచే) పిల్ల లేరీ. అంతా ఏమయినారూ.

కాం: పెద్దపిల్ల లిద్దరూ నీళ్ళు చేరేస్తున్నారు. పిల్లలు బడిలోంచి రాలేదు.

శ: (దగ్గరికి వచ్చి ఖాళీప్లేట్లు చూసి చిరాకుగా) మింగ మెతుకులు లేవు మీసాలకి సంపెంగ నూనెలట. తింటానికే నాస్తి అయితే చిరుతిండ్లు కూడానా.

కాం: (వనక్కి తిరిగి) అమ్మాయిని చూడ్డానికి వచ్చారండీ?

శ: అల్లాగా! మరి నాకు కబురంపావు కాదేమే?

కాం: వాళ్లు అర్జంటుగా ఏదో పని మీద వచ్చారట. అరగంటలోనే పిల్లను చూసి వెళ్ళిపోయారు.

శ: ఎంతిమంది వచ్చారేం?

కాం: పెళ్లికొడుకు, అతని పినతండ్రి, మన పోతరాజు.

శ: పిల్లా డెలాగున్నాడు?

కాం: నిక్షేపంలాగున్నాడు. బాగా చదువుకున్నాడట. కొద్దో గొప్పో ఉన్న వాళ్ళేట. పిల్ల మంచివంగడంలో పుట్టిందీ, అందమైనదీ అయితే, కట్నాలూ కానుకలూ విషయాల్లో అంత పట్టింపులుండవట.

శ: వెళ్ళేటప్పు డేమన్నా చెప్పారా.

కాం: లేదండీ. అన్ని సంగతులూ పోతరాజుగారితో కబురంపుతారట.

శ: (ఉస్సురంటూ కుర్చీమీద కూర్చుని) ఏం కబురో ఏమో. 4 ఏళ్లనుంచీ రెండోదానికి సంబంధాలు చూస్తున్నాం. ప్రతివాళ్ళూ వచ్చి చూసి పోవడమే కాని "ఊ" అని పోరాయె. వచ్చే 80 రూకల్లో ఈ చూపుల సత్తాల్ని మేపడానికే సగం అయిపోతున్నది.

కాం: పూర్వమే నయమండీ. కతికితే అతకదని ఏదీ ముట్టుకునేవారు కాదు.

శ: ఇంతకీ పిల్ల నచ్చిందా...

కాం: నచ్చకేం చేస్తుందీ. బంగారపు బొమ్మలాంటిది దానికేం లోటూ.

శ: (నిట్టూర్చి) డబ్బు లోటే పెద్ద లోటు. అదే ఉంటే కన్ను సొట్టయినా, కాలు సొట్టయినా, అప్సరసలూ అణిముత్యాలూలా కనిపిస్తారు వాళ్ల కళ్లకి.

కాం: అందరూ డబ్బుకే ఆశపడితే బీదపిల్లలకి పెళ్ళి లెలాగవుతాయి.

శ: అవకపోతే కన్నవాళ్లకి కష్టం కాని పెళ్లి చూపులవాళ్లకేం నష్టం.

కాం: ముండా చూపులే. కూర్చోబెట్టి నిలబెట్టి, నడిపించి, పాడించీ మాట్లాడించీ, అడ్డమైన పరీక్షలూ చేసి ఉన్నంతసేపూ దాన్ని నానాహైరానా పెట్టేస్తారు గదా. మా కాలంనాడు ఈ సోద్యాలెరగం.

శ: (నవ్వి) ఎరుగుంటే నీలాంటి వాళ్లకి పెళ్లయేదా?

కాం: (కోపంతో) అనే వాళ్లు ముందు వాళ్ళ అందచందాలు ఎన్నుకుని మరీ అంటే మంచిది.

శ: భుజాలు తడుముకుంటా వెందుకే. అయినా నీ వన్నమాట నిజమేలే. చూపులకొచ్చేవాళ్లు ముందు వాళ్ల అందచందాలూ తాహతులూ, ఎన్నుకుని పిల్లల్ని శల్యపరీక్ష చేస్తే బాగుండేది. కూటికి గతిలేకపోయినా కోతుల్లాగున్నా, కొండంత కోర్కెలతో వేలానికి నిలబడతారీ పెండ్లికొడుకులు. ఎవడెక్కువ పాడితే వాడివైపు మొగ్గుతారు. ఇక మొదలు పిల్లనిచ్చినవాడికి తిరుకువరం. నలుగురాడపిల్లలున్న వాడి కొంపగుండమయినట్టే.

కాం: అలాగని చెయ్యకతప్పుతుందా. ఏదో గంతగితగ్గ బొంత.

శ: వెధవబొంతలూ నీవూనూ—అలాగే ముత్యంలాంటిపిల్లకి ఏకోశానా తగనివాడికి వెధవకిచ్చి అంటగట్టావు.

కాం: ఏం. మీ పిల్లకోసం పిల్లజమీందారుని తెచ్చి కట్టుకో వద్దన్నానా.

శ: (నిట్టూర్చి) తల్లీ లేనిది గదా, అందులో అందరిలో పెద్దదిగదా అని ఉన్న పిత్రార్జితం తెగనమ్మి ఊళ్ళు గాలించాను మంచి సమ్మంధంకోసం. ఎమ్. ఎ. అయితే 80 వేలూ, బియే. అయితే 40, చివరికి స్కూలు ఫైనలు కి సార్లుతప్పిన పక్షిగాడికూడా 10 వేలంటే ఎక్కడ తెచ్చేదీ?

కాం: ఈ రోజుల్లో చదువుకున్న వాళ్ళే మరీ మండిపోతున్నారు.

శ: (ఛీత్కారంతో) హృదయమూ, సంస్కారమూ, మానవత్వమూ లేని వీళ్ళ చదువు కాల్చనా – పాపం. పెద్దదాని మొఖం చూస్తే కడుపు చెరువై పోతుంది.

కాం: విధంచెడ్డా ఫలందక్క లేదాయె. భగవంతుడికి ఎప్పుడు దయవస్తుందో.

శ: భగవంతుడు! ఉన్నాడాఅంట!

కాం: అయ్యో బాగుంది. దేవుడే లేకపోతే ఇంత ప్రపంచమూ ఎలానడుస్తుందీ.

శ: ఉంటే గింటే భగవంతుడిది ఒట్టి పక్షపాతబుద్ధి. మూలిగేనక్కలమీదే తాటికాయలుపడేసి తమాషా చూస్తాడు. (ప్రవేశం పోతరాజు.)

పో: మూలిగేనక్క లెవరండోయి!

శ: ఇంకెవరు. ఆవిడొకనక్క. నేనొకటి. మిగతాపిల్లలు.

పో: బావగారు పరిహాసధోరణిలో పడ్డారు.

శ: ఈ పరిహాసం వెనక భగ్నమండే హృదయం ఉంది.

పో: మనస్సు కుదుట పర్చుకోండి. కష్టాలు కలకాలం ఉంటాయా.

శ: మాయింట్లో కాపరముంటున్నట్టే ఉంది.

పో: చింతలేని మానవు డెక్కడున్నాడండీ. కాలం కర్మం కలిసి రావాలిగాని, అన్నీ సవ్యంగా సమకూడ కేంచేస్తాయి. ఏమమ్మాయి! చెల్లెమ్మ. ఇంతకీ నా గొంతేమన్నా తడపదల్చుకున్నావా! అలాగే పోమ్మన్నావా. గొంతుక ఆర్చుకపోయేట్టు పెళ్ళివారితో వాదించివచ్చాను.

కాం: సంమ్మంధం రైటు చేసుకువస్తే నోటితోపాటు చేయికూడా తడుపుదుం గదా అన్నయ్యా.

పో: నీ సంగతి నేనెరగా అమ్మాయి.

శ: పోయి బావగారికి కాఫీపట్టుకురావే, (కాంతమ్మ వెడుతుంది.) ఏమండీ ఇంతకీ మీరు వెళ్ళినపని కాయా పండా?

పో: ఏంచెప్పను బావగారూ. ముహూర్తికి మూడువిసాలు పండేసమయంలో నక్షత్రపువెధవలు అడ్డుపుల్ల వేశారు. వచ్చిగానే రాలిపోయింది.



"నాన్నా ! ఇప్పుడే చెబుతున్నా ! ఇకమీద పెళ్ళిచూపులవాళ్లొస్తే, నే చస్తే కనబడను.
నేను సంతలో గుఱ్ఱాన్నేంకాను అడ్డమైనవాళ్ళూ పరీక్షించికొంటానికి."

శ: (నిట్టూర్చి) ఇదికూడా వట్టిదేనా.

పో: మన రోజుల్లో నూరబద్దాలాడి పెళ్ళిచేయాలనే వారు. ఇప్పుడు నూరబద్దాలాడి పెళ్ళిపడగొట్టడమే చూస్తారు.

శ: మా కర్మకి ఒకర్నని ఏం లాభం.

పో: ఒక మాటడుగుతా ఏమనుకోరు గదా.

శ: అడుగండి దానికేం.

పో: మీ పెద్దమ్మాయి విషయం.

శ: సరే కానీండి.

పో: ఏమీలేదు. మీరు ఆడపిల్లలు కలవారు. నలుగురిలో వేలెత్తి.

శ: (చురుకుగా) అంత అప్రతిష్ఠపని మా అమ్మాయి ఏం చేసిందీఅంట!

పో: మీ అమ్మాయిసంగతి నాకు తెలియందికాదు. కాని లోకులు కాకులండీ బావగారూ! కాకులు.

శ: ఊరి కాకులకోసం నాబిడ్డను గద్దకప్పజెప్పమంటారా?

పో: మీ మంచికోసం మీ రెండోపిల్ల పెళ్లికోసం. పెద్దమ్మాయి కాపరానికి వెళ్లక ఏణ్ణర్థనుంచి ఇంట్లోపడి ఉందని నలుగురమ్మలక్కలూ, అయ్యవార్లూ ఒక్కటే గుసగుస.

శ: నాయింటి విషయం ఒకరికెందుకూ?

పో: అలా అని ఊరుకుంటే బాగానే ఉండేది. వచ్చిన ప్రతి పెళ్లివారితో పరిచయం చేసుకుని ఈమాట కాస్తా ఊదిపోతున్నారాయే.

శ: (నిట్టూర్చి) హుం.

పో: పెద్దపిల్ల అలా ఇంటకూర్చున్నప్పుడు అరక్తం పంచుకుపుట్టిన రెండోది మాత్రం కాపరం మండబెట్టి విడుస్తుందా అని సందేహం కలిగించేట్టుగా—

శ: పాపిష్టివెధవలు.

పో: కాదూ మతి. ఇందుకనే ఇన్నాళ్లూ ఒక్క సమ్మంధం రైటు కాకపోతా. ఇందుకనే ఇవ్వాళ నిశ్చేషంలాంటి సమ్మంధం తప్పింది. ఏదో మీమేలు కోరి చెబుతున్నా. పెద్దమ్మాయిని అత్తవారింటికి పంపకపోతే—

శ: ఎలా పంపేదయ్యా. కున్నంలో ఎముకలేకుండా విరగ్గొడుతుంటేనూ—కట్టగుడ్డ తినతిండీ పెట్టక చంపుతుంటేనూ.

(60-వ పేజీ చూడండి)

★ మూలిగే నక్కలు ★

(81-వ పేజీ తరువాయి)

పో: ఏదో మొగుడూ పెళ్ళాలయాక కీచులాడకుండాను ఉండరు, కలుసుకోకా ఉండరు. మొగుడయింతర్వాత స్వంత పెళ్ళానికి బుద్ధిచెప్పుకోడానికి కాస్త చేయి చేసుకున్నంతమాత్రంచేత మీరు పిల్లను తీసుకురావడం అట్టే సమంజసమంటారా బావగారూ?

శ: పిల్ల వాళ్ళు పెట్టే బాధలకు ఏట్లోపడబోతుంటే ఇరుగూపొరుగూ చూసి తోడిచ్చి పుట్టింటికి పంపారు.

పో: అబ్బాయి అమ్మాయి మీద కారాలూ మిరియాలూ నూరడానికేదన్నా కారణం.

శ: ఏముంటుంది. మూడుముళ్ళూ పడేటప్పటికే ఉన్నదంతా ముక్కలయింది. వచ్చేజీతం ఒక్కపూటకే కనాకష్టంగా ఉంటే ఆమహానుభావుడికి మహారాజభోగాలు వెలిగించలేదని అలిగి పిల్లనిపీక్కుతింటాడు.

పో: అద్గదీ! ఊరికే అన్నారా అల్లుళ్ళని దశమగ్రహాలని.

శ: ఏలినాటి శని ఏడేళ్ళేకాని దశమగ్రహం పట్టిందా చచ్చేదాకా ఒదలదు.

పో: అయిందేదో అయిపోయింది. ఈ పాటిదానికింత రాద్ధాంతం చేయడం అతనికే బాగులేదు. పిల్లనిచ్చినవారు కనుక నిమ్మకి నీరెత్తినట్టూరుకోవడం మీకూ బాగులేదు. నామాట విని ఏదో సర్దిచెప్పి పిల్లని—

శ: ఏం సర్ది చెప్పేదీ. పిల్లకి అత్తారిల్లంటేనే బెదురుపట్టుకుంది.

పో: అలాఅంటే ఎలా. ఇంతకీ చల్లకి వచ్చి ముంతదాచడందేనికీ. ఈవ్యవహారం ఏదోవిధంగా తేలకపోతే సమ్మంధాలు తేవటం నాచేతకాదు సుమండీ—

శ: ఏం చేస్తాం. వాళ్ళరాత ఎలాగుంటే అలాగవుతుంది.

(కాంతమ్మ తెరలో. కాఫీతయారయింది తెమ్మంటారా)

పో: ఎందుకమ్మాయి నీకంత కష్టం. నేనే వచ్చి తాగిపోతాలే. రండి భావగారూ.

శ: (నిట్టూర్చి) మీరు తాగిరండి. నాకిప్పుడు తాగాలని లేదు.

పో: అచ్చొచ్చొ. మీరు లేకుండానా.

శ: ఫరవాలేదు. వెళ్ళిరండి. (పోతరాజు పోతాడు. శరభయ్య ఉస్సురంటూ దిగాలుబడి చూరు చూస్తుంటాడు. కాస్సేపటికి పోతరాజు, కాంతమ్మ తిరిగి వస్తారు.)

పో: బావగారూ, నే పోయివస్తా. నే చెప్పిన విషయంమాత్రం గట్టిగా ఆలోచించండి. అమ్మాయి నీవుకూడా ఒక్కమాట చెవినివేయి. (పోతాడు.)

కాం: అయితే ఇదికూడా సున్నా అయిందటగా!

శ: (నీరసంగా) ఆ!

కాం: ఇక పెళ్ళిబేరాలు వచ్చే ఆశకూడా లేదటగా!

శ: (విసుగ్గా) నిజమే కావచ్చు.

కాం: మరి ఏమాలోచించారూ?

శ: ఆలోచించడానికేముంది కనక.

కాం: బంగారమంటి సమ్మంధం. పిల్ల నచ్చితే కట్నాలూ కానుకలూ అక్కర లేదన్నారు కూడా.

శ: అయ్యుండొచ్చు.

కాం: పిల్లకూడా నచ్చిందట.

శ: నచ్చే ఉండొచ్చు.

కాం: అయినా సంమ్మంధం చెడిసింది. కారణంకూడా చెప్పాడు.

శ: చెప్పే ఉండొచ్చు.

కాం: ఏం వెటకారమండీ.

శ: మాటాడితే మారా మేకులాగుంది.

కాం: మాటాడమనలేదు మిమ్మల్ని.

శ: సరే మానేస్తాను.

కాం: (కోపంతో) పనిచేసి చూపించమంటున్నా.

శ: ఏంపని?

కాం: చెయ్యరానిదేంకాదు. పెద్దపిల్లని - అత్తారింటికి -

శ: కసాయివాడికి మేకని తోలినట్టు తోలమంటావు.

కాం: ఇప్పటికే నలుగురూ నోట్లో గడ్డిపెడుతున్నారు.

శ: నోరుముయ్యవే ఛటాచోర్! ఈ గడ్డిపెట్టే వెధవలంతా దారిద్ర్యదోషంచేత 14 ఏళ్ళ కుంకని 40 ఏళ్ళవాడికి కట్టబెట్టే ముందు సాయం చేయకపోయారూ. తల్లిదండ్రులు సంఘభయంచేత చేసిన తప్పుకు, హిందూసంఘంలో పుట్టిన పాపమాత్రంచేత, ఆ దౌర్భాగ్యుడు ప్రసాదించిన రోగాలతో కుళ్ళుతూ, వాడు ఒళ్ళు హూనం చేస్తుంటే నా బిడ్డ అలమటిస్తున్నప్పుడు, ఈ గడ్డిపెట్టే వెధవలంతా ఏమయినారూ? దాని ఇష్టానికి వ్యతిరేకంగా దాన్ని అత్తారింటికి పంపను నేనున్నంతకాలం కలో గంజో తాగుతూ ఇక్కడే పడిఉంటుంది.

కాం: ఉపన్యాసం బాగానేఉంది కాని, మీ తరువాత ఏం చేస్తుంది.

శ: నా తరువాతా! నా తరువాత - (తల గోక్కుంటాడు.)

కాం: మీరు వెనకేసిన వెండిబంగారాలు కరిగించుకు తింటుందా?

శ: ఏ పనోపాటో చేసుకుంటుంది.

కాం: వంటపని తప్ప దానికేం చేతవును. స్వంతింట్లో మొగుడితో తన్నులు తింటంకన్నా పరాయింట్లో చాకిరీచేసుకు చీవాట్లూ చెప్పుదెబ్బలూ తింటం మంచిదా?

శ: అదేనయం. స్వతంత్రంగానన్నా బ్రతుకుతుంది.

కాం: ముండా స్వతంత్రంలే. బ్రతుకు చెడి పుట్టింటికిచేరిన ఆడది చెల్లని కానీలాటిది. నామాట విని మరియాదగా పిల్లని అత్తారింటికి పంపండి.

శ: సవతి తల్లివి కనుకనే పిల్లని ఒదుల్చుకుందామనుకుంటున్నావు.

కాం: మీ రింతసేపు పెద్దపిల్లనే పట్టుకేడిస్తే తతిమ్మా వాళ్ళగతేంకాను. పెళ్ళాం చచ్చినప్పుడు పెళ్ళిమానెయ్యక పోయూరా?

శ: మానేయవలసింది. అప్పుడు కళ్ళు బైర్లు కమ్మాయి.

కాం: (ఒళ్ళుమండి) చెట్లలా ఎదిగిన కూతుళ్ళని నెత్తిమీద కుంపట్లలా పెట్టుకు పల్లెలో మసలడం ఎంత బాధో మీకేం తెలుసు? నలుగురి దెప్పుళ్ళూ పడలేక బయటికి వెళ్ళడానికి తలకొట్టేసినట్టుంటోంది. అందులో లేని వాళ్ళంటే అతిలోకువమాటలంటారు. నే పడలేనబ్బా ఈ దెప్పుళ్ళు. మీరు మీ అమ్మాయిని అత్తారింటికి పంపితే పంపండి లేకపోతే—

శ: లేకపోతే?

కాం: మీరు మీ అమ్మాయీ కలిసి ఈ ఊళ్ళో ఉట్టిగట్టుకూరేగండి, నాపిల్లలతో నే పుట్టింటికి పోతా.

శ: ఫో. అక్కడేముంది మింగడానికి.

కాం: నారు పోసినవాడు నీరు పోయక పోడులే.

శ: పోస్తాడు — పోస్తాడు. వెళ్ళు-మహా బాగా వెళ్ళు.

ప్ర: (ప్రవేశం కోపంతో) ఎందుకలా గొంతు చించుకుంటున్నారు? మీమాటలన్నీ విని అక్కయ్య [illegible]టింట్లో కుమిలి కుమిలి ఏడుస్తున్నది.

కాం: ఏడవనీ — వచ్చిన నష్టమేం లేదులే.

★ మూలిగే నక్కలు ★

శ : పుండుమీద కారం చల్లినట్లామాట లేమిటి?

కాం : ఎద్దుపుండు కాకికి నొప్పా, మీ కెంతసేపూ మీ పెద్దకూతురుగోడే. నే నుంతా చచ్చానూ ఏం.

ప్ర : బ్రతుకు చెడితే కన్నవారుకూడా పగవారే అవడానికి. మొగాడైతే గాది క్రింద పంది కొక్కును మేపినట్లు మేపుతారు చచ్చేదాకా ఎన్ని బడవ పనులు చేసినా.

కాం : నోరుముయ్యి భడవా న్యాయం చెప్పొచ్చావు. న్యాయం ఇదుగో! ఇప్పుడే చెబుతున్నా. ఇవ్వాళ అదయినా అత్తారింటికి పోవాలి. నేమైనా పోవాలి. అంతే—

ప్ర : మీ రెందుకు కీచులాడుకుంటారు. అక్కయ్య ఎలాగూ అత్తారింటికి పోతానంటోంది మీరు అస్తమానం దెబ్బలాడుకుంటే చూడలేక. ఇక ఉండదట.

శ : కళ్ళు చల్లబడ్డాయా నీకు. వాడు మళ్ళీ చావగొడితే—

ప్ర : విసుర్రాయి గొడ్రాయి చూసుకుంటుందటగాని తిరిగి రాడటలే. వెళ్ళమ్మా వెళ్ళు! నీ మొగుడు కొట్టినా, తిట్టినా, పీక పిసికిచంపినా కిమ్మనకుండా పడమనీ, మొగుడి చేతిలో పెళ్ళాం చస్తే కైలాసం సిద్ధిస్తుందనీ, దానికి ఇటు ఏడుతరాలవారినీ అటు ఏడుతరాలవారినీ, భగవంతుడు పీకకి తాకేసి అమాంతం బొందితో స్వర్గానికి చేరేస్తాడనీ, పతివ్రతాధర్మాలు నూరిపోసి మరీ పంపు అదుగో! అది గుండె పగిలేట్టు ఎలా ఏడుస్తున్నదో మీరు మనుష్యులు కారూ రాక్షసులు (లోపలికి పారి పోతుంది.)

శ : భగవంతుడా! ఇంకా ఎన్నాళ్లు ఈ బ్రతుకు బరువు మొయడం. (నిట్టూరుస్తాడు.)

SISTA'S—WL—36—TEL.

2

(అదే ఇల్లు, 7, 8, నెలల తర్వాత. కాంతమ్మ కాఫీ ప్లేట్లు తీస్తుంటుంది.)

కా : (విసుక్కుంటూ) ముండా కాఫీ ప్లేట్లు. నెలకి 4 సార్లు అవచ్చే నాలుగు రాళ్ళు కాఫీ చెయ్యడమే కనిపిస్తుంది. వీటికి అంతెప్పుడో.

శ : (ప్రవేశం పై మీద కండువాతో చెమట తుడుచుకుంటూ)

కాం : (ఆదుర్దాగా) ఏమండీ! పెళ్లివా రేమన్నారు?

శ : పిల్ల నచ్చిందట.

కాం : నచ్చకేం చేస్తుంది. మరి చేసుకుంటామన్నారా?

శ : ఆ!

కాం : కట్నాలూ, కానుకలూ—

శ : ఏముంది. వెయ్యిన్నూటపదహార్లు!

కాం : అమ్మయ్యో!

శ : 500 లాంఛనాలు ఆడబడుచు కట్నాలు.

కాం : బాబోయ్!

శ : వెండిచెంబు వెండిపళ్లెం పట్టుబట్టలు.

కాం : చచ్చాం!

శ : చివర కదలాగూ తప్పదులే.

కాం : ఏం మాటలవి! పోనీ పిల్లా డేమన్నా చదువు సంధ్య—

శ : ఓ! స్కూలుఫైనలు 8 సార్లు తప్పాడు.

కాం : పోనీ - పోనీ - ఉద్యోగం ఏదైనా—

శ : లేకేం. నిక్షేపంలాంటి ఉద్యోగం. కోమటికొట్లో గుమాస్తా.

కాం. బాగానే ఉంది. పోనీ పనళ ఎవరైనా—

శ : ఉండకేం - తల్లి, తండ్రి, 4 గురు అప్పచెల్లెళ్లు.

కాం : ఈ మాత్రపు గొప్పకేనా వెయ్యిన్నూట పదహార్లూ?

శ : ఇప్పటికి వచ్చిన వాళ్లల్లో వీళ్లే తక్కువ అడిగారు.

కాం : పిల్లవాడైనా ఏమంత గొప్పవాడు కాడు. అమ్మాయికి నచ్చుతాడో లేదో.

శ . (విసుగ్గా) నీ కూతురేమన్నా మహారాజు కూతురనుకున్నావా స్వయంవరాలు చేయడానికి.

కాం : ఉన్నమాటంటే అలా కరవొస్తారేమండీ.

శ : అయితే వచ్చిన ఒక్క సమ్మంధాన్నీ కాదన్నమంటావా

కాం : ఏం స్థిరపరచారేమిటి?

శ : పెళ్ళి.

కాం : పెళ్ళా!

శ: అవును పెళ్ళే. చెవుడా ఏం.

కాం: అది కాదండీ - మరి ఇంత డబ్బా ఎలా వస్తుంది. కొంప తీసి—

శ: కొంప పోసి కొంటేనే కుర్రవాడొచ్చాడు.

కాం: కొంపే!

శ: అవును. ఈ పంచ అమ్మకంతో పిల్లది ఇంట్లోంచి వెడుతుంది.

కాం: అయ్యో! ఈ కాస్త కొంప కూడా నెత్తిమీద ఆధారంగా లేకుండా పోతే—

శ: ప్రపంచంలో చెట్లకేమీ లోటు రాలేదుగా. పక్షులతోబాటు దిక్కుమాలిన పక్షులం మనమూ అక్కడికే పోదాం.

కాం: (నిట్టూర్చి) పోనీ ఇంకెక్కడన్నా—

శ: (విసుగ్గా) కన్నం వేయాలంతే. అర్థాకలితో ఏళ్లు గడిపిన నాకు కన్నం వేసే బలం కూడా లేదు. ఒకవేళ సాహసించి చేసినా పట్టుబడి జైలుకు పోతే నా పొట్ట నిండుతుంది గాని మిమ్మల్నెవరు మేపుతారు?

కాం: బాగానే ఉంది మీ వరస - ఇంతకీ ముహూర్తం పెట్టించారా.

శ: వారంరోజు లుంది.

కాం: అంత దగ్గరలోనా. పెద్దదానికి కబురంపండి. పెళ్ళికి ఉత్తరం ముక్కన్నా వ్రాసింది కాదేం.

శ: ఎందుకు వ్రాయాలీ. పీకమీద చెయ్యేసి తోస్తివాయెను. ఒకవేళ వ్రాద్దామన్నా వాడు వ్రాయనిస్తాడూ. మొన్న చూడడానికి వడితే నేనీల్లేదని పిల్లనింట్లో పెట్టి తాళం వేసుకున్నాడు గదా! ఏకంగా ఒక్కసారే విందువుగాని లేచావు కబురు చల్లగా.

కాం: రామారామ! ఇవ్వాళ అన్నీ దరిద్రపుమాటలే వస్తున్నాయేం నోటంట?

శ: (నిట్టూర్చి) సంఘాని కెదురుతిరిగే త్రాణలేక గానుగెద్దులా జీవిత భారాన్ని మోసుకుతిరిగే గర్భదరిద్రుడికి ఇంతకన్నా మంచి మాటలెలావస్తాయి.

కా: ఆడపిల్లల్ని కన్న దరిద్రులంతా మనలాంటి గుణగుష్టవంతులే. ఇంతకీ కుర్రాడు నచ్చకపోతే ప్రభ పెళ్ళికి ఒప్పుకుంటుందో లేదో. అసలే పెడసరపుది.

(ప్రవేశం ప్రభావతి కోపంతో)

ప్ర: నాన్నా! ఇప్పుడే చెబుతున్నా! ఇకమీద పెళ్ళిచూపుల వాళ్ళొస్తే నే చస్తే కనబడను, నేను సంతలో గుడ్డాన్నేం కాను. అడ్డమైనవాళ్ళు వచ్చి ఎముకలూ గూటాల్ని పరీక్షించి కొంటానికి.

శ: అయ్యో! సంతలో గుడ్డాలేనయ్యం. డబ్బిచ్చి కొనుక్కుపోతారు. ఆడపిల్లకి ఎదురిచ్చి కూడా కాళ్ళావేళ్ళాపడాలి.

కాం: ఇక పెళ్ళిచూపులవాళ్ళు రారులేవే.

ప్ర: పీడావదిలింది.

కా: చూడు ఈ మధ్య నాల్గుసార్లు వచ్చిపోయారు. నిన్న ఇవ్వాళా వాళ్ళ తాలూకు వాళ్ళొచ్చారుగా ఆ పెళ్ళికొడుకు ఎలాగున్నాడే?

ప్ర: ఓ! అద్భుతంగా ఉన్నాడు.

కా: (సంతోషంతో) అతనితో నీకు పెళ్ళినిశ్చయమైంది.

ప్ర: (అదిరిపడి) ఏమిటీ! ఆ పిల్లికళ్లు రాగిజుట్టు, తారు రంగు మనిషితోనా?

కాం: ఏం చిత్రమే మరీని. అతనికేం నిక్షేపంలాగున్నాడు. కొద్దిగా నలుపు అంతేనా అయినా అందం మగవాళ్ళకెందుకూ?

ప్ర: అందం ఆడవాళ్ళకేనా కావలసింది?

శ: అవును తల్లీ. మగవాడు సంఘాచారాల పుణ్యమా అని వధువును ఏరుకుని చేసుకునే పరిస్థితిలో ఉన్నాడు.

ప్ర: నాన్నా! అతన్ని చేసుకోమంటం నీకు ధర్మంగా ఉందా?

శ: (నిట్టూర్చి) అమ్మా! ఇంటిపరిస్థితులు నీకు తెలియనివి కావు. ఐదేండ్లనుంచి వెతకగా వెతకగా ఇది ఒక్కటే కుదిరింది. ఎంతకంతకే తృప్తిపడాలి.

కా: ఏం రాలుగాయ పిల్లవే మరీని నీకోసం కొండమీద కోతి నెక్కడ తెమ్మంటావు.

ప్ర: మీరు అక్కరాల కొండమీద కోతినే తెచ్చారు.

కాం: దీనికే కొంప కుండమయింది.

ప్ర: ఏం కొంపకేమయింది?

కాం: ఏమవ్వాలనివుందో అదే అయింది. కొంప అమ్మేశారు.

ప్ర: (విచారంగా) నాన్నా నా పెళ్ళి కోసం కొంపెందుకమ్మావు.

శ: (విసుగ్గా) లేకపోతే మంత్రాలకి చింతకాయలు రాల్తాయా! ఇంట్లో ఎర్రని ఏగానీకూడా ఉండదని నీకు తెలుసు. పెళ్లెలా అవుతుంది? కన్నందుకు క్రిందబడో మీదబడి నా ధర్మం నెరవేర్చక తప్పదు కదా.

ప్ర: ఎందుకు తప్పదు. ఉన్న ఒక్క కొంప నమ్మి నాకు పెళ్లిచేస్తే మిగతా వాళ్ళకెలా చేస్తావు.

శ: వాళ్లరాత ఎలాగుంటే అలాగవుతుంది.

ప్ర: రాతటరాత. చేతులారా చేసేది రాతమీద రుద్దేదీ! నేనసలు పెళ్లేచేసుకోను.

కాం: బాగుంది వరస. తొండముదిరి ఊసరవెల్లి అయిందట. పెళ్లికాని ఆడది అప్రతిష్ట పాలౌతుంది. ఇప్పటికే సగం చచ్చున్నాం.

శ: అమ్మాయి! నీవున్నది పల్లెలో. పుట్టింది హిందూసంఘంలో అన్నమాట మరిచిపోకు.

ప్ర: ఇప్పుడెంతోమంది పెళ్లిళ్లు మానేసి చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నారు. వాళ్లందర్నీ సంఘం ఏంచేస్తున్నదీ.

కాం: ఉద్యోగాలు చేసి ఊళ్లేలే చదువు నీకెక్కడిదే. ఈ పల్లెలో ఉన్నపాటి చదువు చదివేటప్పటికే కళ్లు నెత్తిమీదకి వచ్చి పెద్దల నెదురిస్తున్నావు. ఇంకా చదువంట చదువు.

ప్ర: నాన్నా! నాకీ పాడుపెళ్లి చేసి బ్రతుకు మంట గలిపేకన్నా ఆడబ్బు నాకియ్యి పట్నం వెళ్లి చదువుకుంటా.

కాం: 20 ఏళ్లు నెత్తిమీదకి వచ్చాయి. ఇప్పుడు మొదలెడతావు చదువు. ఉన్న ఊళ్లో ఉద్యోగాలు వదులుకుని నిన్ను కాయడానికి పట్నం బైలుదేరాలికమేం. చచ్చే కాలానికి సారికావిళ్లట.

శ: ఊరుకోవే ఎందుకలా గొంతు చించుకుంటావు. అమ్మాయి! వ్యవహారం అప్పుడే చెయ్యి దాటిపోయింది. మొగపెళ్లివారు

సంక్రాంతి అభినందనములు !!!

రుచికరమైన ఫలహారమునకు, కాఫీకి.

శ్రీ రామ విలాస్

336, తంబుచెట్టి వీధి,

మద్రాసు 1.

(ఆంధ్రపత్రిక ఆఫీసు ఎదురు)

తప్పక దయచేయండి.

అమృతమువంటి

అనంగ ప్రభాయాకుతి

సుందరమైన యౌవ్వనానికి. ప్రకాశవంతమైన తేజస్సుకు ఉత్తమమైనది, ధాతువును గట్టిపరచి వృద్ధిచేయును బలహీనతచెందిన నరములకు శక్తిని, పటుత్వమును చేకూర్చును సుఖమైన దాంపత్యజీవితమునకు ఉత్తరపాదముగల సంజీవి.

30 మాత్రలు రు. 10, 15 మాత్రలు రు. 5.

మదనమంజరి ఫార్మసీ

184, చైనాబజారురోడ్డు, మద్రాసు.

ఈశ్వరదాస్ అండ్ కంపెనీ, రాజమండ్రి.

శ్రీనివాస మెడికల్ స్టోర్సు - విజయవాడ.

మాలిగే నక్కలు

కట్నండబ్బు అప్పుడే ముదరా పుచ్చుకున్నారు. కోమటి సుబ్బయ్యకి ఇల్లుఅమ్మకానికి అగ్రిమెంటు వ్రాసిచ్చి అడ్వాన్సు పుచ్చుకుని పెళ్ళివారికిచ్చి ముహూర్తం వారంరోజుల్లో పెట్టంచేశాను.

ప్ర : (ఏడుస్తూ) నాన్నా! నీవుకూడా నాగొంతు తడిగుడ్డతో తెగకోస్తావా!

శ : అమ్మాయి! పెద్దమనుష్యుల్లోమాట. పరువు కాపాడు.

ప్ర : పరువట పరువు! నా సుఖంకన్నా నీకు పరువే ఎక్కువా?

శ : పరువు పోగొట్టుకున్న మానవుడు బ్రతికున్నా చచ్చినట్టే.

ప్ర : అంత పరువుమీద మమకారం ఉన్నవాడివి ముందే నన్నెందుకడగలేదు.

శ : ఇది నీమంచికే చేశాను.

ప్ర : ఏం మంచి గడమంచి.

కాం : నోరుముయ్యవే గయ్యాళి ఘటమా! ఆనాడు మీ పెద్దక్కయ్య ఇలాగే పెద్దలమాట కాదందా. చేతకాకపోతే చూసయినా నేర్చుకో.

ప్ర : (రోషంతో) అందుకనే అనుభవిస్తోంది. నే చచ్చినా నాకిష్టంలేని పెళ్ళిచేసుకోను. మీ రెలా చేస్తారో చూస్తాను.

కాం : అయితే చావు. పీడా వదిలిపోతుంది. నీలాంటివాళ్ళు బ్రతికి మమ్మల్ని డిపించేకంటే చావడమే మంచిది. ఒక ఏడ్పేడ్చి ఊరుకుంటాం.

ప్ర : (ఏడుస్తూ) అవును హైందూ సంఘంలో ఆడదైపుట్టి బ్రతికి ఆనందించడానికి స్వాతంత్ర్యమేదీ. ఇష్టం లేని పెళ్ళిచేసుకుని అక్కలా కుమిలి కుమిలి చచ్చేకన్నా ఒక్కసారే చావడం మంచిది. అసనే చేస్తాలే మీ కళ్ళుచల్లగా. మీకు ఖర్చూ ఉండదు. (ఏడుస్తూ లోపలికి పోతుంది.)

శ : ప్రభా! ప్రభా! చూడు ఇప్పుడసలే ప్రథమకోపి. అశ అడిగాయున్న ప్రథమోద్రేకంలో ఏం అఘాయిత్యం చేస్తుందో.

కాం : ఆ! దాని మొఖం. నాలుగురోజుల్లో అదేదారికి వస్తుంది.

శ : అలా అనకు. ప్రథి తత్వం మనుష్యులు ముందాలోచన లేకుండానే ఏపనయినా చేస్తారు. నా మాటవిని వెళ్ళి దాన్ని సముదాయించు.

కాం : సముదాయిస్తే వినేరకమా అది.

శ : పోనీ పెళ్ళి మానుకుందామంటే డబ్బుకు నీళ్ళు వదులుకోవడమే కాకుండా ఇక జన్మలో దీని పెళ్ళికూడా జరగదు. ఏ దారీ తోచడంలేదు. పాపం పెద్దది ఇంతకన్నా దౌర్భాగ్యపు సంమ్మంధం తెచ్చినా కిమ్మనలేదు. ఏం బాధలు పడుతోందో ఏమో. (ప్రవేశం, టెలిగ్రాం. బంట్రోతు. శరభయ్య టెలిగ్రాం తీసుకుని చదివి ఒక్కసారి కూలబడిపోతాడు.)

కాం : (కంగారుగా) అయ్యో! అయ్యో! ఏమండీ! అందులో ఏముందండీ! అలా అయిపోయారూ. బాబూ! నీవైనా చదివిచెప్పు బాబూ! అయ్యో!

టెలి : (చదివి) మీ—మీ—పెద్ద—మ్మా—

కాం : ఏమయింది నాయనా—ఏమయింది బాబూ. తొందరగా చెప్పు నాయనో.

పో : నూ—నూ—తిలో బడి చచ్చిపోయిందట.

కాం : అమ్మ నా తల్లో! ఏం పని చేశావే ఓయమ్మో! మీ నాన్న నెవరికి అప్పజెప్పావే ఓ తల్లో! ముదనష్టపు పెళ్ళి చేశామే ఓ యమ్మో! నీ చావుకే వచ్చిందా ఓ తల్లో! అప్పుడే నూరేళ్ళూ నిండాయా ఓ తల్లో!

[దొడ్లో గుభాలున చప్పుడు. తెరలో "ఓ కాంతమ్మగారో! అయ్యో! ఓ కాంతమ్మగారో! ప్రభావతి నూతిలో దూకిందండోయి! రండోయి]

కాం : ఓ నా బిడ్డో! ఓ నా తల్లో! రండర్రోయి! రండర్రోయి! నా బిడ్డని కాపాడండోయి! దేవుడో! ఎంతపని చేశావు దేవుడో! లేవండీ! లేవండీ! కొంపమునిగిందండీ. (గుండె బాదుకుంటూ పరుగెడుతుంది.)

శ : (అమాంతం శివమెత్తినవాడిలా లేచి పరిగెడుతూ) పద! మనం కూడా అందులోనే ఊరుకుదాం. దరిద్రం వదిలిపోతుంది. ★

తల్లిపాలు మాన్పించే సమయంలో బిడ్డపట్ల జాగ్రత్త!



చిన్నవయస్సులో మీబిడ్డ పొందే జాగ్రత్తమీదనే అతని పూర్ణ ఆరోగ్యము ఆధారపడి వుంటుంది. భయంకరమైన లివర్ వ్యాధి ఆ చిన్న వయస్సులోనే ఆరంభమనవచ్చును. వ్యాధిని వెంటనే పోల్చి సరియైన చికిత్స చేసినచో ఫరవాలేదు, గాని అశ్రద్ధ చేసినచో దీర్ఘకాలం వేదన, జబ్బుతో బాధ అనుభవింపవలసి వస్తుంది.
జిమ్మివారి లివర్‌క్యూర్ చంటిబిడ్డలపాలిటి శ్రీరామరక్ష. ప్రతి సంవత్సరం ఈమందు వేలాది పసిపాపలను వ్యాధినుంచి కాపాడి ఆరోగ్యవంతులను చేస్తున్నది.

జిమ్మి వెంకటరమణయ్య అండ్ సన్స్
మైలాపూరు, మద్రాసు-4

బ్రాంచీలు :
ఓరుగంటివారివీధి, విజయనగరం సిటీ.
5 ఏ, కమలానగర్ (జి. టి. రోడ్డు, సబ్జిమండి) ఢిల్లీ.

[illegible]-1-276-[illegible]